క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

పొందూరు: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులంతా ఈ నెల 29వ తేదీలోగా జీవిత ధ్రువపత్రాలను (లైఫ్ సర్టిఫికెట్) సమర్పించాలని స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంకం ధర్మారావు, పాలిశెట్టి సూర్యప్రకాశరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక ఉపఖజానా కార్యాలయ పరిధిలో 810 మంది విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ పింఛనుదారులు ఉన్నారన్నారు. వీరిలో 523 మంది మాత్రమే జీవిత ధ్రువపత్రాలను అందజేశారని.. మిగిలిన వారు త్వరితగతిన సమర్పించాలని సూచించారు. సమర్పించకపోతే మార్చినెల పింఛన్ నిలిచిపోయే అవకాశం ఉందన్నారు.

హెచ్ఎంలకు శిక్షణ



హెచ్ఎంలకు శిక్షణ ఇస్తున్న డీఆర్పీ

సారవకోట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సారవకోట, పాతపట్నం, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలకు శిక్షణ నిర్వహించారు. రాబోయే రోజుల్లో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులే ఆ స్కూల్ కాంప్లెక్స్‌ల కోర్స్ డైరెక్టర్లుగా వ్యవహించేందుకు వీలుగా వారికి పలు అంశాలపై శిక్షణిచ్చారు. వీళ్లంతా ఆయా మండలాల స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి విద్యాభివృద్ధికి దోహదం చేసేందుకు వీలు పడుతోందని సారవకోట ఎంఈఓ ఎంవీ రమణ తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో నలినీ కాంత్, సీఎంవో భాస్కరరావు, ఐఈఆర్టీ కోఆర్డినేటర్ గోవిందరావు, ఎంఈవో భూలక్ష్మి పాల్గొన్నారు.

సక్రమంగా ఓటర్ల జాబితా

సరుబుజ్జిలి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున ఓటర్లు జాబితాల్లో ఎటువంటి తప్పులు దొర్లకుండా సక్రమంగా తయారు చేయాలని తహసీల్దార్ పి.రమేష్‌బాబు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలు, సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో ఫొటోలు, చిరునామా, పేర్లు వివరాలు సక్రమంగా తనిఖీచేసి లోపాలుంటే సరిచేయాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాబూరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవత వార్షికోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

బూర్జ: మండల కేంద్రం బూర్జ గ్రామదేవత అసితల్లిఅమ్మవారి మూడో వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పురోహితుల ఆధ్వర్యంలో అమ్మవారికి లలితా దేవి హోమం, కుంకుమ పూజలు జరిగాయి. గ్రామస్తులు ఘటాలతో వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. చొక్కర కృష్ణమోహన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తహసీల్దార్, ఎస్సైలకు సత్కారం



తహసీల్దార్ అంబేడ్కర్‌ను సత్కరిస్తున్న నాయకులు

బూర్జ: మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్.వి.అంబేడ్కర్‌ను మండల నాయకులు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. అలాగే స్థానిక పోలీసుస్టేషన్ ఎస్సైగా బాధ్యత్యలు చేపట్టిన జి.వి.ప్రసాద్‌ను కూడా తహసీల్దార్ కార్యాలయంలోనే సత్కరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కరణం కృష్ణమూర్తినాయుడు, పలువురు నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

నేడు కొర్లకోటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆమదాలవలస రూరల్: కొర్లకోట గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు స్పీకర్ క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ప్రకటన విడుదలైంది. స్పీకర్ తమ్మినేని సీతారాం ఆధ్వర్యంలో కార్యక్రమం జరగనుంది.

ఆవేదన తీరింది..

ఇది కదా.. అభివృద్ధి



నేడు: సీసీ రోడ్డు నిర్మాణంతో అహ్లాదంగా ఉన్న నర్సింగపల్లి రోడ్డు



నాడు: రాళ్లు తేలి ఉన్న నర్సింగపల్లి రోడ్డు

నరసన్నపేట: గత టీడీపీ ప్రభుత్వ పాలనలో మండలంలోని పలు రోడ్లు అధ్వానంగా ఉండేవి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు పడేవారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఐదేళ్లు కాలక్షేపం చేసి తమ సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకున్న టీడీపీ నాయకులు ప్రజా సమస్యలను గాలికొదిలేశారు. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్ల అభివృద్ధిపై దృష్టిసారించింది. స్థానిక ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రత్యేక శ్రద్ధతో ఇప్పుడు మండలంలోని రోడ్లన్నీ మెరుగుపడడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ, పీఆర్‌తో పాటు పీఐయూ శాఖ పరిధిలో ఉన్న రోడ్లను రూ. 80 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేశారు.

- కరగాం పంచాయతీ నర్సింగపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు గతంలో అధ్వానంగా ఉండగా నేడు సుందరంగా తయారైంది. గ్రామీణ రోడ్ల అభివృద్ధి పథకంలో భాగంగా రూ. 1.20 కోట్లతో కంబకాయ నుంచి నర్సింగపల్లి వరకూ రెండు కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మించారు. దీంతో గ్రామస్తులు ఇప్పుడు సంతోషంగా ప్రయాణం సాగిస్తున్నారు.
- నరసన్నపేట మండలం కోమర్తి నుంచి సారవకోట మండలం బద్రి వరకూ 25 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రోడ్డు ప్రస్తుతం అహ్లాదంగా ఉంది. ప్రభుత్వ నిధులు రూ. 25 కోట్లతో రోడ్డును నాణ్యతా ప్రమాణాలతో నిర్మించారు. గతంలో సింగల్ రోడ్డుగా ఉన్న ఈ రహదారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది. ప్రసుతం విస్తరించారు. రోడ్డు డబుల్ కావడంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను అభినందిస్తున్నారు.
- కామేశ్వరిపేట ఆర్అండ్‌బీ రోడ్డు నాలుగేళ్ల క్రితం చాలా దారుణంగా ఉండేది. నడిచేందుకు కూడా ప్రజలు నానా అవస్థలు పడ్డారు. దీంతో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కృషితో రూ. రెండు కోట్లు వెచ్చించి ఈ రోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేయడంతో ప్రజల కష్టాలు తీరాయి.



నాడు: సింగల్ రోడ్డుగా ఉన్న కోమర్తి-బద్రి రోడ్డు



నేడు: డబుల్ రోడ్డుగా మారిన కోమర్తి-బద్రి రోడ్డు



నాడు: అధ్వానంగా ఉన్న కామేశ్వరిపేట రోడ్డు



నేడు: రన్‌వేను తలపిస్తున్న కామేశ్వరిపేట రోడ్డు

శ్రీశైలం మల్లన్నకు తలపాగా సిద్ధం



మగ్గంపై తలపాగాను సిద్ధం చేస్తున్న కార్మికుడు

ఆమదాలవలస రూరల్: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీశైలంలో కొలువైన మల్లికార్జున స్వామికి తలపాగా సిద్ధమవుతుంది. అక్కులపేట గ్రామ దేవాంగుల వీధిలో చేనేత కార్మికుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో చేనేత తయారీ ద్వారా మల్లన్నకు తలపాగాను సిద్ధం చేస్తున్నారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామివారికి ఇక్కడి తలపాగాను సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ వస్త్రాలను తయారు చేసే కార్మికులు భక్తిశ్రద్ధలతో, పరమ నిష్టతో చేస్తున్నారు. శివనామస్మారణతో వస్త్రాలను తయారు చేసి స్వామికి సమర్పిస్తామని తయారీదారులుచెప్పారు. మహాశివరాత్రి రోజున ఈ తలపాగాను శ్రీశైలంలో ఉన్న శిఖరానికి చుట్టడం జరుగుందన్నారు. దీని పొడవు 365 మురలు (182.5 మీటర్లు) ఉంటుందని, మొత్తం 14 మంది కార్మికులంతా కలిసి తయారు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

బాలల హక్కులను కాపాడుదాం

నరసన్నపేట: బాలల హక్కులను కాపాడడంతో పాటు బాల్య వివాహాల కట్టడికి ప్రతిఒక్కరూ సహకరించాలని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా మండల కమిటీని ఏర్పాటు చేశారు. దీంట్లో ఎంపీపీ అధ్యక్షతన ఇతర ప్రధాన అధికారులను సభ్యులుగా చేర్చారు. ఇక నుంచి బాల్య వివాహాల నిర్మూలనకు ఎవరికి వారు తమ పరిధిలోఉన్న వారికి చైతన్య పరచాలని ఎంపీపీ సూచించారు. ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జీవో 31 ఈ కమిటీలు వేస్తున్నట్లు చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.తులసీనాయుడు తెలిపారు. మంగళవారం కమిటీ మొదటి సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. బాలల హక్కులను కాపాడటానికి, బాల్య వివాహాలు అరికట్టేందుకు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈవో శాంతారావు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి, ఏపీఎం సాయిలక్ష్మి, ఎన్‌జీవో ప్రతినిధి శ్రవంతి ఉన్నారు.

ఆస్పత్రి భవనాల పరిశీలన



భవనాలను పరిశీలిస్తున్న అధికారులు

నరసన్నపేట: స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్మాణం చేసిన నూతన భవనాలను ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ సత్యప్రభాకర్ మంగళవారం పరిశీలించారు. రూ. 12.50 కోట్లతో చేపడుతున్న భవన నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయి. ఈ సందర్భంగా ఆస్పత్రి పాత భవనాలపై మరో అంతస్తు నిర్మాణం కావడంతో కింద ఉన్న డ్రైనేజీ, వాటర్ రన్నింగ్ పైపులు ధ్వంసం అయ్యాయని.. దీంతో ప్రస్తుతం ఆస్పత్రిలో ఉంటున్న రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఏవో ఏపీవీ రమణమూర్తి ఈఈ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఈఈ సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి వాటిని కూడా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని కోరారు. ఈఈ వెంట డీఈ శిమ్మన్న, ఏఈ వెంకటేష్ ఉన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పొందూరు: పొందూరులో అత్యంత విలువైన ప్రదేశంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్న వారిపై చర్య తీసుకోవాలని సర్పంచ్ రేగిడి లక్ష్మి కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. 45 ఏళ్ల క్రితం సర్వే నంబరు 192లో ప్రభుత్వం జిరాయితీ స్థలం కొనుగోలు చేసి కొంత మంది దళితులకు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల పట్టాలు ఇచ్చిందన్నారు. మిగిలిన స్థలాన్ని ఆటస్థలం, కమ్యూనిటీ భవనం, అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి విడిచి పెట్టినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ స్థలం ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఇంకొక వ్యక్తి ఆక్రమణకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రశ్నించిన వీఆర్వో, కార్యదర్శులను బెదిరిస్తున్నారని తక్షణమే క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని కోరారు. దీనిపై స్థానిక తహసీల్దార్‌కు, పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

జాతీయ పోటీల్లో సత్తా చాటండి



క్రీడాకారులతో మధుసూదన్, అథ్లెటిక్స్ సంఘ ప్రతినిధులు, పీఈటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ:

జాతీయస్థాయి అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి పతకాలతో తిరిగిరావాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు పిలుపునిచ్చారు. ఈ నెల 16 నుంచి 18 వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 19వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు మంగళవారం పయనమై వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల వద్ద ఉన్న జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో జరిగిన వీడ్కోలు కార్యక్రమానికి మధుసూదనరావు హాజరై శ్రీ స్పోర్ట్స్ కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్.విజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, కె.మాధవరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ, టి.శ్రీనివాసరావు, టి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లా బృందానికి మేనేజర్లగా సమగ్రశిక్ష పీఈటీలు ఇ.అప్పన్న (కె.కె.రాజపురం), గణేష్ (జలంతరకోట) వ్యవహరించనున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పొన్నాంపేట పోలింగ్ కేంద్రంలో వసతులు పరిశీలిస్తున్న వేణుగోపాల్

ఆమదాలవలస రూరల్: పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ కె.వేణుగోపాల్ అన్నారు. పొన్నాంపేట, రామచంద్రాపురం, చిట్టివలస గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. కేంద్రాల్లో విద్యుత్, మరుగుదొడ్లు, రెయిలింగ్ వంటి సదుపాయాలు పక్కా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. వసతుల్లేని పోలింగ్ కేంద్రాలను గుర్తించి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆయన వెంట బీఎల్వోలు ఉన్నారు.

గ్రామాల్లో ఎస్సై పర్యటన

సరుబుజ్జిలి: శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా ప్రజలు సహకరించాలని ఎస్సై కె.నిహార్ సూచించారు. నందికొండ, తురకపేట, వెన్నెలవలస, ఎం.ఎస్.పురం, వ్యాసులపేట గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం విక్రయాలు, నగదు తరలింపు, ఇతరత్రా కవ్వింపు చర్యలకు పాల్పడకుండా పోలీస్ యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో రాత్రి వేళల్లో గస్తీ మరింత ముమ్మరం చేస్తామన్నారు. దేవాలయాలు, చర్చిలు వద్ద సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

కరవంజలో ఆరోగ్య సురక్ష శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

జలుమూరు: కరవంజ గ్రామంలో వైఎస్సార్ ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. 355 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించినట్టు జలుమూరు మెడికల్ అధికారులు తాడేల శ్రీకాంత్, చల్ల వంశీకృష్ణ తెలిపారు. వీరిలో ముగ్గురిని శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స అందించేందుకు రిఫర్ చేశామన్నారు. కరవంజ పరిధి వెలుసోద, గుగ్గిలి, తాళ్లవలస గ్రామాలస్తులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

బూర్జ: మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక పోలీసు స్టేషన్ ఎస్సై జి.వీ ప్రసాద్ తెలిపారు. తోటవాడ పంచాయతీ పరిధి టి.ఆర్.రాజుపేట గ్రామానికి చెందిన వ్యక్తి కొల్లివలస జంక్షన్ మీదుగా కొన్ని మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా అదులోకి తీసుకొని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బలదలో నేత్ర వైద్య శిబిరం



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కొత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం పేద ప్రజల జీవితాల్లో వెలుగు నింపుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, ఎంపీటీసీ సభ్యుడు సారవల్లి ప్రసాదరావు అన్నారు. బలద గ్రామ సచివాలయంలో శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ సారిపల్లి భారతి శిబిరాన్ని ప్రారంభించారు. 97 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 23 మందికి అంతర కుసుములు ఉన్నట్లు గుర్తించామని ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకీరామయ్య తెలిపారు. వీరిని శ్రీకాకుళంలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ రామారావు ఉన్నారు.

కులగణన సర్వే పరిశీలన



కులగణన సర్వేను పరిశీలిస్తున్న దృశ్యం

కొత్తూరు: ఆరోగ్యశ్రీ యాప్‌లను వలంటీర్ల ద్వారా లబ్ధిదారులతో డౌన్ లోడ్ చేయించాలని గ్రామ సచివాలయము సిబ్బందికి ఎంపీడీవో త్రివిక్రమరావు సూచించారు. కొత్తూరులోని పలు వీధుల్లో మంగళవారం పర్యటించి సెల్‌ఫోన్‌లో యాప్ డౌన్లోడ్ చేయించాలన్నారు. అలాగే కులగణన సర్వేను పరిశీలించారు. సర్వే శతశాతం పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శి బట్టు, వీఆర్వో రాము, డీఏ శ్రావణ్ రాజ్, ఏఎన్ఎం విజయలక్ష్మి, గ్రామ వలంటీర్‌లు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



రికార్డును పరిశీలిస్తున్న తులసీ వరప్రసాదరావు

కొత్తూరు: వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చే గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు వైద్య సిబ్బందికి సూచించారు. కొత్తూరులోని వెల్‌నెస్ సెంటర్‌ను మంగళవారం సందర్శించి ఓపీ రిజిష్టర్‌ను పరిశీలించారు. ఇద్దరు ఎంఎల్‌హెచ్‌పీలు విధుల్లో లేకపోవడం సరికాదన్నారు. రోగుల వివరాలు కూడా సక్రమంగా లేవన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సిబ్బంది పనిచేసి ప్రజలకు వైద్య సేవలు అందిచాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసి నాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రమాదాల బారి నుంచి రక్షణ పొందాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం న్యాయ సేవాసదన్‌లో ఎంపీఆర్ లా కళాశాల, అంబేడ్కర్ యూనివర్సిటీలోని లా కాలేజీ విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనన, మరణ ధ్రువపత్రాలు, వివాహ రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, ఆస్తుల రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శ్రీకాకుళం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.వి.గంగాధరరావు ట్రాఫిక్ నిబంధనలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ రవికుమార్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జి.వెంకటరావు, జిల్లా పంచాయతీ అధికారి పి.వెంకటేశ్వరరావు, ఎంపీఆర్ లా కళాశాల ప్రిన్సిపాల్ కె.మోషే, ఎచ్చెర్ల లా కాలేజీ ఫ్యాకల్టీ టంకాల బాలకృష్ణ, న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీదేవికి అష్టోత్తర పుస్తకార్చన

శ్రీకాకుళం కల్చరల్: గుంటూరు జిల్లా చొడవరం దాసరిపాలెంలో గాయత్రీ దేవాలయంలో అష్టోత్తర పుస్తకార్చన నిర్వహించినట్లు కాశిని వేంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వజయం పిల్లల శ్రేయస్సు కోసం కాశిని వేంకటేశ్వరరావు, రమణమ్మ దంపతులు స్వీయ రచన 'శ్రీవేద జనని గాయత్రి'ను 108 పుస్తకాలతో అర్చన జరిపించి బుధవారం శ్రీపంచమి సందర్భంగా భక్తులకు ఉచితంగా వితరణ చేసేందుకు ఆలయ ధర్మకర్త రామిరెడ్డికి అందజేశారు. దేశంలోని పురాణ ప్రసిద్ధ, విభిన్న రూపాల్లోని 108 గాయత్రీ ఆలయాల విశేషాలను పుస్తకంలో పొందుపరిచారు.

అమ్మవారికి పుస్తక పూజ



డీసీసీబీ కాలనీలో కల్చరల్ పార్కు ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

కార్పొరేషన్ ప్రజలు ఎక్కడా ఇబ్బందులకు గురికాకుండా అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని డీసీసీబీ కాలనీలో రూ 16.84 లక్షలతో నిర్మించిన కల్చరల్ పార్కును మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేసిన దాఖలాలు లేవన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లులా భావించి పాలన సాగిస్తున్నామన్నారు. రూ.380 కోట్లతో ఫిషింగ్‌హార్బర్ ఏర్పాటుచేసి జిల్లాను అంతర్జాతీయ వ్యాపారాలకు అనువుగా తయారుచేస్తున్నామని చెప్పారు. కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రి ప్రారంభించడం చరిత్రాత్మకమన్నారు. పవన్, చంద్రబాబులు విమర్శలు చేయడమే తప్ప ఒక్క మంచిపనైనా చేయగలిగారా అని ప్రశ్నించారు. ఉద్దాన ప్రాంతానికి మంచినీటి ప్రాజెక్టు ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని అన్నారు. మహిళా ఐఏఎస్ అధికారి కమిషనర్‌గా రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, చల్ల శ్రీను, రాజేంద్రప్రసాద్, బిర్లంగి రామ్మోహన్‌రావు, చల్ల అలివేలుమంగ, టంకాల బాలకృష్ణ, పి.సుగుణారెడ్డి, పైడి మహేశ్వరరావు, కొండాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు జోనల్ అధికారుల నియామకం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని 28 గ్రామ సచివాలయాల పరిధిలో 90 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను తొమ్మిది మంది జోనల్ అధికారులను నియమించారు. ఈ అధికారులు తమ పరిధిలో పోలింగ్ కేంద్రాలకు సంబంధించి పూర్తి వివరాలు అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. సమస్యాత్మక, అతిసమస్యాత్మక, గతంలో ఎన్నికల నిర్వహణ పరిస్థితి వంటి పూర్తి నివేదిక అందజేస్తారు. ఈ నివేదిక ఆధారంగా అధికారులు ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటారు. అధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు తహసీల్దార్ శ్యాంకుమార్ తెలిపారు.